# నిగూఢ

## లంకపల్లి సంపత్ కుమార్

"మనిషిలోని నిక్షిప్తమైన భావనలు బయటకు రావాలంటే అవి బయల్పడే పరిస్థితులు కల్పించాలి"

– ఫ్రాయిడ్

హి ఈజ్ లవింగ్ మి!

నో డౌట్ ఎబౌట్ యిట్. కాని అతను తన ప్రేమను వెల్లడి చేయడం లేదు. ఎందుకు? ఎలా.. ఎలా అతను తనను ప్రేమిస్తున్నాడని చెప్పించడం?



** ** **

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవయ్యాయి పూజకు. అసలే పెద్ద కళ్ళు. ఇంకా విశాలంగా అయ్యాయి విస్మయంతో. ఆమె చూపులు తెరిచి వుంచిన స్పైరల్ నోట్ బుక్‌పైనే కేంద్రకరించబడ్డాయి. బాగుండదనిపించినా.. అలవోకగా పదాల వెంబడి కన్నులు కదిలాయి.

ప్రియా..

"నీవు కలువ కంటివి. చిలుకల కొలికివి

తీగ చేతుల దానవు. పూబంతి గుబ్బెత్తవు

నీ నుదుట వెన్నెల వెలుగులు, నీ మోములో జిలుగులు

నీ నోట కోకిలాలా పాలు, నువ్వు.. నువ్వు..

నువ్వు కులుకు మిటారివి. కటారి కత్తివి"

మరోసారి చదివింది కన్నులతోనే. అప్రయత్నంగా వణుకుతున్న చేతులతో ఆ నోట్ బుక్ పేజీలు కొన్ని తిప్పింది. అలాగే మరికొన్ని కవితలు. ఎంతో మధురంగా వ్రాయబడ్డాయి. మరొక విషయం. ఆమెను మరీ ఆశ్చర్యంలోకి నెట్టి వేసింది. ఆ పుస్తకం పేజీల మధ్య ఎప్పటిదో గులాబి వాడిపోయి, ఎండిపోయిన పూరెక్కలు..

"హలో" ఉలిక్కిపడింది పూజ. ఎదురుగా తలుపు దగ్గరే తన బాస్. వినయ్ తొట్రుపడింది. "సార్" కంఠం వణికింది. తప్పు చేసిన దానిలా శరీరం కృంగి పోయింది.

"ఎనీ ప్రాబ్లమ్.. మిస్ పూజా? మళ్ళీ అదే కంఠం. "నో సార్" గిల్టీగా తనకు తాను కంట్రోలు చేసుకుంటూ టేబుల్ ఎదురుగా నిలుచుంది. చేతిలో ఫైల్స్. డిక్టేషన్ పాడ్, పెన్.

"లెటర్స్ అన్నీ కంప్యూటర్ ఫీడ్ అయ్యాయా." అన్నాడు వినయ్ చైర్‌లో కూర్చుంటూ.

ఎస్.. ఎస్.. సార్.. ఇదిగో అని టేబుల్ పైన పెట్టింది వణుకుతున్న చేతులతో. టేబుల్‌పై నున్న బుక్‌ను మడిచి అతి భద్రంగా డ్రాయర్‌లో వుంచాడు వినయ్. అతనిలో ఎలాంటి ఫీలింగ్స్ లేవు. ఈ వీక్ అంతా వర్క్ లోడ్ ఎక్కువగా వుంటుంది. కాస్త స్ట్రెయిన్ తప్పదు అన్నాడు. గంభీరంగా ఆమె ముఖంలోకి చూస్తూ ఎందుకో కళ్ళెత్తి చూసింది. అతను అలాగే తన కళ్ళల్లోకి చూస్తున్నాడు. గభాలున కళ్ళు దించేసుకుంది. తనకు తెలుసు. అతను అలాగే తన వైపు చూస్తుంటాడని. అక్కడే.. తాను 'ఫ్లాట్' అయింది. ఆ కళ్ళల్లో కనిపించే మెరువులు ప్రేమగా, ఆప్యాయంగా కళ్ళలోంచి గుండెల్లోకి దిగిపోయే బాణాలు. వాడి చూపులు. తనకు డిక్టేషన్ యిస్తూ మధ్యలోనే ఆగిపోతాడు. పూజకు తెలుసు అతను తన ముఖంలోకే చూస్తుంటాడని. ఆ మౌనం అర్థంకాక కళ్ళెత్తి చూస్తే సూటిగా తన కళ్ళలోకే చూస్తుండిపోతాడు. ఏదో అయిపోతూ హృదయాన్ని లాగుతున్నట్టుగా ఏదో ఆకర్షణ. వినయ్ మాత్రం ఏమి పట్టనట్టు మళ్ళీ డిక్టేషన్‌లోకి వెళ్ళిపోతాడు. ఎందుకు తాను బేలగా మారుతుందో తెలీదు. ఆ మెరువుల కళ్ళల్లో ఎలాంటి ఇతర భావాలు తాను చదవలేకపోయింది. అతను మాత్రం అలాగే తన కళ్ళలోంచి చూస్తూ హృదయాన్ని జల్లుమనిపించే యవ్వనపు థ్రిల్. అప్పుడే జీవితపు వాకిళ్ళలోకి అడుగెడుతున్న ఇరవై రెండేళ్ళ పూజకు తట్టుకోవడం కష్టమే మరి.

ఆలోచనలు మాని సడెన్‌గా కళ్ళెత్తి చూసింది. అతను తననే గమనిస్తున్నాడు. ఆలోచనలతో తాను కాలి బొటన వేలితో ఫ్లోర్‌పై సుకుమారంగా కదిలిస్తుంటే అతని దృష్టి అక్కడే వుంది. ఎంతో అనీజీగా అన్పించి మెల్లిగా సర్దుకుంది పూజ.

'నైస్' అనే మాట ఎంత మెల్లిగా అతను అనుకున్నా తన చెవులు దాటి పోలేదు. "పూజా.. మిగతా లెటర్స్ విషయం చూడు చాలా అర్జంట్" అన్నాడు. మిగతా ఫైళ్ళలోకి తన దృష్టిని సారిస్తూ

"బ్రతుకు జీవుడా" అని బయటపడింది.

పూజ ఈ పబ్లిక్ సెక్టార్ ఆఫీస్‌లో చేరి ఐదు నెలలవుతుంది. ఆమె అక్కడ స్టెనో కమ్ కంప్యూటర్ ప్రోగ్రామర్. తాను పని చేస్తుంది లీవు



వేకన్సీలో. అంతకు ముందున్నావిడ మెటర్నిటీ లీవుపై వెళితే టెంపరరీ జాబ్‌లో చేరింది. అప్పడే కాలేజీ చదువుల నుండి బయట ప్రపంచంలోకి అడుగిడిన పూజకు వెంటనే టెంపరరీ జాబ్ దొరకడం అదృష్టమే. జాబ్ చేయడం సరదాగానే వుంది. కాని తన బాస్, అతని మంచితనం.. అతనిలోని టాలెంట్ ఇతరులతో సౌమ్యంగా మాట్లాడి తనకు కావాల్సిన పని చేయించుకునే ప్రతిభ తననెంతో ఆకర్షించింది. ఎన్నో విషయాలు అతడి దగ్గర నేర్చుకుంది. అన్నింటికి మించి వినయ్ పట్ల ఆరాధన భావం. దినదినం పెరిగిపోతున్నది. బహుశా తాను అక్కడ పని చేసేది మరో పది రోజులే. ఆ రూమ్‌లో ప్రతి వస్తువూ తనకు చిరపరిచయం. అవన్నీ వదిలేయాలంటే బాధనే! వినయ్‌ను చూడకుండా వుండగలదా? బాస్ అనే సరికల్లా ఎంతో పెద్దాయన అనుకుంది. కాని.. పెళ్ళికాని హాండ్సమ్ అనుకోలేదు. అతను తనను ప్రేమిస్తున్నాడు. అవును.. మరోసారి అనుకుంది పూజ.

పూజ ఎప్పడూ చుడీదార్ వేసుకునేది. కాని ఆ రోజు శారీ కట్టుకుని వెళ్ళింది ఆఫీసుకు. తనకు తెలుసు. శారీ తనకు చాలా అందాన్నిస్తుందని. పూజను చూడగానే థ్రిల్ అయిపోయాడు వినయ్. నైస్ అని మెల్లిగా విన్పించింది. అతని కళ్ళల్లో మెచ్చుకోలు. బాగున్నావు సుమా అనే భావన. ఆ తర్వాత తరుచూ శారీలోనే వెళ్ళడం అలవాటు చేసుకుంది. వినయ్ తనను ఆకాశపు రంగు బ్లూ శారీలో మరీ మరీ లైక్ చేస్తాడన్న విషయం ఇట్టే కనిపెట్టేసింది మరొక రోజు. తనతో బాటుగా తన కాలేజీ ఫోటో ఆల్బమ్ తీసికెళ్ళింది. ఫైల్సను తీసికెళుతూ దాన్ని వినయ్ టేబుల్‌పైనే మరచిపోయింది. నిజానికది వినయ్ చూడాలనే వదిలేసి వచ్చింది. కాసేపయ్యాక ఏదో మరచిపోయినట్టుగా సారీ నా ఆల్బమ్ అని తీసుకెళ్ళిపోయింది. అందులో తన బెస్ట్ ఫోటో మిస్సింగ్ ! ఇలా ప్రతి రోజు ఒక అనుభవం. నిజానికి అతని కోసమే ప్రత్యేకంగా తయారయి వెళుతుంది ఆఫీసుకు.

ఆ నోట్ బుక్‌లోని పదాలు తనని తృప్తి పరిచినా ఆ పడిలిపోయి, అంత భద్రంగా దాచబడ్డ గులాబి. ఎందుకో మనస్సులో అసూయ. అతను మరొకరినెవరినైనా ఏమో. తాను వెళ్ళిపోయేలాగా. అతని హృదయం తెలుసుకోవాలి. ఎలా? ఫ్రాయిడ్ మనోవైజ్ఞానికుడు గుర్తుకు వచ్చాడు. ఎస్. తానే ఏదో చేయాలి. జస్ట్ టు నో యీజ్ హార్ట్.

మరుసటి రోజు ఎంతో అసీజిగా అనించింది. బస్‌స్టాప్ వరకూ వెళ్ళి ఆఫీసుకు వెళ్ళొద్దని నిర్ణయించుకుంది. అంతే వెనక్కి తిరిగి వచ్చేసింది. లెట్‌మి సీ. ద రియాక్షన్ అనుకుంటూ వెనక్కి వస్తూ దారిలో సెక్షన్ హెడ్ గుర్నాధం గారికి ఫోన్ చేసింది.

సార్.. నేను పూజను ఈ రోజు లీవు కావాలి అంది. 'బాస్ పర్మిషన్ తీసుకున్నావా అమ్మా' అటునుండి గుర్నాధంగారి గొంతు.

"లేదు సార్. ఈ ఐదు నెల్లలో నేనెప్పడూ లీవ్ తీసుకోలేదని మీకు తెలుసు కదా సార్' ' అంది మెల్లిగా.

"అవుననుకో. కాని, వర్క్ హెవీగా వుంది బాస్ చిరాకు పడతాడేమోనని" నసిగారు గుర్నాధం.

"నేనింకా అక్కడ పని చేసేది మరో పది రోజులు అంతే. అందులో నా పర్సనల్ వర్క్‌సార్. నాకు పెళ్ళి చూపులు."

ఆగిపోయింది పూజ. అతని రియాక్షన్ ఏమై వుంటుందా అని ఆలోచిస్తూ.

"అలాగా అయితే నో ప్రాబ్లమ్. నే చెప్తాను సార్‌కు అన్నాడు గుర్నాధం.

"ఆడపిల్లను ఆ విషయం బాస్‌కు చెప్పలేను కదండీ. ఎవరి పెళ్ళిలో చూశాడట. నన్నే పెళ్ళి చేసుకుంటానని మరీ పట్టుబట్టి కట్నం కూడా వద్దన్నాడని విన్నాను. కుదిరితే డేట్స్ ఫిక్స్ చేసుకోవడమే". కాని.


"చాలా సంతోషం పూజా. నీ పెళ్ళి ఫిక్స్ అవ్వాలని కోరుంటున్నాను. ఈ

విషయం కూడా బాస్‌కు చెప్తాను. ఆల్ ది బెస్ట్" అని ఫోన్ పెట్టేశాడు గుర్నాధం.

చిన్నగా నవ్వుకుంది పూజ. ఎస్. ఒక పావు కదిలించింది. మరి గురుడు. అదే వినయ్ రియాక్షన్ ఎలా వుంటుందో లెట్ మి ప్లే ఎ గేమ్ అనుకుంది నిజంగా ప్రేమిస్తే

వ్వాట్ ఆశ్చర్యపోయాడు వినయ్. ఆ రోజు పూజ లీవ్ పెట్టిందనగానే. అంతే కాకుండా ఆమెకు పెళ్ళి చూపులు అన్న విషయం మరీ బాధించింది. హృదయంలో ఏదో తెలియని ఆవేదన. తనని ఆమె అర్థం చేసుకోలేకపోయింది. పూజ కేవలం ఆర్నెళ్ళకై లీవు వెకన్సీలో జాయిన్ అయిన దగ్గర్నుంచీ గమనిస్తున్నాడు. ఎంతో తెలివిగల అమ్మాయి. ఏపనైనా యిట్టే చేసేయ్యగలదు. అందులో ఆమె అమాయకత్వం ఎంతో నచ్చింది తనకు. ఆ కళ్ళలోకి చూస్తూ వుంటే తనను తానే మరచిపోతాడు. తన ఆఫీసులో ఎంతో మంది స్త్రీలు పని చేస్తున్నా అందరిలో లేని ఏదో ప్రత్యేకత పూజలో. పూజ తనలో ఎన్నో ఆశలు రేపింది. ఆమెను మరచిపోగలడా.

తన మనస్సులోని భావన ఆమెకు చెప్పాలని చాలాసార్లు అనుకున్నాడు కాని ఎగ్జిక్యూటివ్‌గా వుండి అలా ప్రపోజ్ చేస్తే ఆమె హర్ట్ అవుతుందనే భవన మరీ పిరికివాడ్ని చేసింది. వినయ్ తన పర్సనల్ నోట్‌బుక్ తెరచి చూశాడు. అందులో కవితలు. . వాడిపోయిన రోజా పూల రెమ్మలు. ఆరోజు అందంగా తయారయి వచ్చింది. కురులలో ఒకే ఒక్క రోజ్ తురుముకుంది. తన దగ్గర డిక్టేషన్ తీసుకొని వెళ్ళిపోయింతర్వాత చూశాడు. కుర్చీ ప్రక్కగా కార్పెట్‌పైన పడి వున్న రోజ్. ఎంతో ఆప్యాయంగా ఆ రోజ్‌ను తీసుకున్నాడు. అది యింకా ఆమె కురుల సువాసనలు వెదజల్లుతూనే వుంది. కొత్తల్లో చేయవలసిన పనులు చేతకాకపోతే ఎన్నో సార్లు విసుక్కున్నాడు. అయినా పట్టుదలతో అన్నీ నేర్చుకుంది. తాను కోపంతో చివాట్లు పెట్టినా అన్నీ మరిచి మళ్ళీ ఎంతో ఆప్యాయతను చూపించేది. తన రూమ్ అంటే ఆమె కెంత యిష్టమో తన ఎదురుగా టీ తాగుతున్నప్పుడు సాసర్‌ను తన మునివేళ్ళతో బంధించి కప్‌తో టీ త్రాగడం. ప్రతీ విషయానికీ ఎంతో నమ్రతతో చిరునవ్వుతోనే సమాధానం చెప్పడం. ఏదో అయిపోతుంది తనకు. పూజా పూజా అనుకుంది. ఆమె జీవితంలోనుంచి వెళ్ళిపోతుందనే ఫీలింగ్. ఏదో చేయాలి. వర్క్ మీద మనస్సు లగ్నం కాలేదు. ఇప్పుడు తన మనస్సులోని మాట వెలిబుచ్చకపోతే ఇక ఎప్పుడూ చెప్పలేదు. వెంటనే గుర్నాధంను పిలిపించి పూజా పర్సనల్ ఫైల్ తెప్పించుకున్నాడు. ఏదో నిర్ణయించుకుని.




"ఏమిటి.. అప్పుడే వచ్చేశావ్ అంది అనసూయమ్మగారు. తిరిగొచ్చిన పూజను చూసి.

"ఏమీ లేదు మమ్మీ. ఎందుకో తలనొప్పిగా వుంటే లీవ్ పెట్టాను. అంది పూజ తల్లితో.

"ఒంట్లో బాగోలేదా' ఆప్యాయంగా అడిగింది కూతుర్ని అనసూయమ్మ గారు.

"అదేం లేదు మమ్మీ. జస్ట్ హెవీ వర్క్. అలసి పోయాను అంతే అంది.

ఏదో టెన్షన్‌తో కూతురు వున్న విషయం గుర్తించింది. కాని తానే చెప్తుతుంది లేమని తన పనుల్లో నిమగ్నమైపోయింది ఆవిడ.

తలనొప్పి అని చెప్పిందే కాని. గబగబా యిల్లంతా సర్దడం, ఫ్రంట్ రూమ్‌ను నీటిగా అరేంజ్ చేయడం అంతా గమనిస్తూనే వుంది. 'ఎవర్నయినా పిలిచావా' అడిగింది తల్లి. ఎవరైనా రావాచ్చు. రాకపోవచ్చు. అయినా యిల్లు నీటుగా వుంటే తప్పులేదుగా" అంది పూజ. షాప్‌కు వెళ్ళి స్వీట్స్, ఫ్రూట్స్, అవీ ఇవీ కొనుక్కొచ్చింది. పేరుకు టి.వి చూస్తూ కూర్చున్నా మన స్సంతా ఆఫీసులోనే వుంది. వినయ.. వినయ్ రెస్పాన్స్ ఎలా వుంటుందో. ఆయన ఎలాంటి రెస్పాన్స్ యివ్వకపోతే. వణికిపోయింది ఒక్కసారిగా నో. తన గేమ్ ఫెయిలవదు అనుకుంది మాట మాటికి బయటకు చూస్తూ.

సాయంత్రం అయ్యేసరికల్లా నిరాశే మిగిలింది పూజకు. ఏదో అయిపోతున్న ఫీలింగ్. అతను తనని ప్రేమించడం లేదా. అతనికి తాను ఏమీ కాదా. సున్నిత హృదయం దెబ్బతింది. ఒక వేళ ఆయన ఏది నిర్ణయించుకున్నా ఫరవాలేదు. తాను ఆయనతో చెప్పి తీరుతుంది. ఆలోచనలు.. గ్రీకువీరుడు. నా రాకుమారుడు.. హమ్ చేస్తూ ఆలోచనలో నిండి పోయింది.

ఇంటి ముందు మోటార్ బైక్ ఆగిన శబ్దం విని ఉలిక్కిపడింది. గబగబా తలుపు దగ్గరకు వెళ్ళి చూసింది. హృదయంలో ఏదో అలజడి. అక్కడ వెహికల్ స్టాండ్ వేస్తూ.. వినయ్.

'మమ్మీ' గట్టిగా అరిచి లోపలికి పరిగెత్తింది. ఆమెకు ఆకాశంలో ఎగురుతున్న ఫీలింగ్.

వంట గదిలో వున్న అనసూయమ్మ గారు అదిరి పడ్డారు. "ఏం జరిగిందీ. అలా అరుస్తున్నావ్" అంది తనని కౌగిలించుకుని తిప్పేస్తున్న కూతురుతో.

"మమ్మీ.. మా బాస్ వచ్చారు నీవు రిసీవ్ చేసుకో. నేను రెడీ అయి వస్తాను. ప్లీజ్" అని బాత్‌రూమ్‌లోకి దూరిపోయింది. పూజ.

ఈవేళ దీని బాస్ రావడం ఏమిటో అనుకుంటూ చేతులు కడుక్కుని బయటకు వచ్చి ఆశ్చర్యపోయింది అనసూయమ్మగారు. ఆఫీసురు అంటే ఏదో పెద్దాయన అనుకుంది. కాని ఇంత చిన్న కుర్రాడా అనుకుంది. "రా. బాబు' అనబోయి రండి అంది. ఆవిడ అతన్ని లోనికి ఆహ్వానిస్తూ.

"నేను.. నేను" ఏదో చెప్పబోయాడు వినయ్. మనస్సంతా కన్ఫ్యూజన్‌గా వుంది. మరీ టెన్షన్‌గా ఫీలవడం వల్ల చెమటలు పడుతున్నాయి.

"అమ్మాయి చెప్పింది. రండి" అని సోఫా చూపించింది అనసూయమ్మ గారు.

కంప్యూటర్ ఫ్లాపీ ఒకటి ఎక్కడుందో మరచిపోయాను. ఆ విషయం పూజను కనుక్కుందామని నసిగాడు సంజాయి



తెరపై లతా

గానకోకిల లతా మంగేష్కర్ ఇటీవల ఒక హిందీ సినివమాలో నటించారు. బోనీ కపూర్ నిర్మిస్తున్న పుకార్ చిత్రంలో క్లయిమాక్సులో వచ్చే పాటలో లతా మంగేష్కర్‌గా కనబడబోతున్నారు. తెరపై నటించడం లతాకు కొత్తకాదు. హిందీ సినిమాలలో బాలనటిగా ఆమె నటించింది.

షీగా వినయ్.

"అలాగా. అంతగా ఫీల్ అవ్వాల్సిన అవసరం లేదు" అంది అనసూయమ్మ గారు ఏమీ అర్థంకాక.

పూజ లీవ్ సడన్‌గా పెట్టేసరికల్లా వర్క్ కొంచెం కష్టపడాల్సి వచ్చింది. అన్నాడు గదిని గమనిస్తూ. అక్కడ పెళ్ళి చూపులు ఏవైనా జరిగిన ఆన వాలు వున్నాయా అని. పూజకు పెళ్ళి చూపులని విన్నాను అనీ అన్నాడు మెల్లగా వినయ్

పెళ్ళి చూపులేంటి అనబోయి ఇదేం చెప్పిందో ఆఫీసులో అనుకుని ఏదో అమ్మాయికి పెళ్ళీడు వచ్చింది కదండీ పెళ్ళి చేయాలనుకుంటున్నాం అంది అనసూయమ్మగారు తన అనుభవాన్నంతా గుర్తు చేసుకుని.

నర్వస్‌గా ఎటో చూస్తున్న వినయ్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. గుడ్‌ఈవినింగ్ సార్ అంటూ ట్రేలో స్వీట్స్, ఫ్రూట్స్‌తో వస్తున్న పూజను చూసి వ్వాట్ ఎ మార్వలెస్. దివి నుండి భువికి దిగిన అప్సరస పూజ. విశ్వనాధుని కిన్నెరసానిలా, నండూరి వారి ఎంకిలా వుంది కళ్ళు చెదిరిపోయే అందం.

"కంప్యూటర్ ఫ్లాపీ ఎక్కడుందోనని" అన్నాడు తన రాకకు కారణం చెప్తూ. దాని కోసమే మీరు రావాలా? ఆఫీసు బాయ్ వున్నాడు కదా. ఆఫీసులో చాలా మంది వున్నారుగా అని అన లేదు పూజ. నువ్వెందుకు వచ్చావో తెలిసిపోయిందిలే అనే చిలిపి తనం ఆమె కళల్లో అగుపించింది. తీసుక్కోండి సార్. అని టేబుల్‌మ ముందు సర్దింది. టీ చేయడానికి లోనికి తప్పుకుంది అనసూయమ్మగారు.

ఇవన్నీ ఫార్మాలిటీస్ ఇవ్వడెందుకు అని, పూజ పెళ్ళని విన్నాను. నచ్చాడా అన్నాడు వణికిపోతూ.

సార్ మీరు అంది ఎంతో ఉద్విగంగా పూజ.

"నచ్చాడు. నన్నే కోరి చేసుకుంటానంటున్నాడు" అంది పెదవుల్ని పంటితో నొక్కిపెట్టి.

మరి నీవు ఏదో అనాలని ఆమె కళ్ళల్లోకి చూస్తుండిపోయాడు. ఆ కళ్ళల్లో కొంటెదనం "నో" అన్నట్టుగా తలాడించింది పరవశంతో.

హుర్రే అని అరవబోయి తనని తాను కంట్రోలు చేసకుంటూ నే వెళతాను. అమ్మగారికి చెప్పండి. అని గబగబా తన మోటార్ బైకి దగ్గరకు కదిలాడు. ఆయన వెనకే వెళ్ళింది పూజ. బైకకున్న ఫోల్డర్ లోంచి ఫ్లవర్ బొకే తీసి ఆమెకందించి 'సీ.. యూ' అంటూ బైక్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయడు.

ఆశ్చర్యంగా ఆ బొకేతో లోపలికి వస్తూ దానికి వ్రేలాడతీసిన టాగ్ విప్పి చూసింది.

"నీవు నా .. కులుకుమిటారివి. నా కటారి కత్తివి అని మాత్రమే వుంది. యూ ఫూల్ అనుకుని ఆ కార్డును ముద్దు పెట్టుకుని హృదయానికి పూలబొకేను హత్తుకుంటున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూడసాగింది తల్లి. ●

## అచ్చొచ్చిన అక్షరం 'కె'



అక్షరాలు, అంకెల సెటిమెంట్లు లేని వారు అరుదుగా వుంటారు. అందునా సినీ రంగంలో వీటికి విశేష ప్రాముఖ్యమున్నది. అయితే ఒకొక్కరి విషయంలో అవి కేవలం యాధృచ్ఛికం కావొచ్చు. సుస్వర సంగీత బాణీలతో 'చెవు' లూరించిన సాలూరు రాజేశ్వరరావుగారి కుమారుడు, నేటి తెలుగు సినీ సంగీత సామ్రాజ్యాన్ని ఏలుతున్న కోటి అసలు పేరు కోటేశ్వర రావు. చక్రవర్తి దగ్గర అసిస్టెంటుగా పని చేస్తున్నప్పుడు ఆయన తన పేరును కోటిగా మార్చుకున్నారు. కోటి ఎక్కువగా రికార్డింగ్ జరిపేది చెన్నయ్ లోని కోదండపాణి రికార్డింగ్ థియేటర్. అది కొండంబాకంలో వున్నది. ఆయన అత్తగారి వూరు నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేట సమీపాన వున్న 'కోట'. ప్రస్తుతం ఆయన వుంటున్నది అడయార్‌కి వెళ్ళేదారిలో వున్న 'కొత్తూరువురం'లో. ఇలా 'కె' అక్షరంతో ఆయనకున్న అనుబంధం విడదీయరానిది. కోటి హైదరాబాద్‌లో నిర్మించనున్న రికార్డింగ్ థియేటర్ పేరు కూడా 'కె' అక్షరం తోనే మొదలవుతుంది.




## ఆశ

నాకు
రసమాస్వాదించే
రసజ్ఞుల మనసు
చదవాలని ఆశ
ముగ్ధమోహన రూపంలోని
అతివ
సొగసులన్ని చూడాలని ఆశ
సలవితమైన
వీనులవిందైన
గాత్రం వినాలని ఆశ
ప్రవహించే
స్వచ్ఛమైన జలపాతం
చూడాలని ఆశ
శిల్పి చెక్కిన
శిల్ప భంగిమల్లోని
అరిదాలు
చూడాలని ఆశ

—యలమంచిలి శివాజీ